20CTR1:20CTR1.qxd 9/19/2026 11:04 PM Page 1






# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026




# గరుడ గమన రారా...

## నను నీ కరుణ నేలుకోరా !



## -భక్తులను బ్రోచిన మలయప్ప

తిరుమల,సెప్టెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:
ఏడుకొండలవేంకటేశ్వర స్వామికి అత్యంత వైభవంగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో ఐదవరోజు శనివారం రాత్రి గరుడాద్రివాసుడుతనకిష్టమైన గరుడునిపై విహరిస్తూ భక్తజనానికి దర్శనమిచ్చాడు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత విశేషసర్వాలంకభూషితుడైన మలయప్పస్వామిని సాయంత్రం 6.30 గంటలకు వాహనమండపంవద్ద గరుడవాహనాన్ని అధిరోహింపజేసిన అర్చకులు వేదఘోష్టితో కర్పూరహారతులిచ్చారు. చల్లటివాతావరణంలో చిరుజల్లులు కురుస్తుండగా వింజామరలు చల్లగా విసురుతుండగా భక్తుల గోవిందనామ్మరణల మధ్య అక్కడ నుండి మెల్లగా మలయప్పస్వామి భక్తకోటిని కరుణించడానికి ఆలయమాఢవీధుల్లో ఊరేగడానికి కదిలాడు. ఆద్యంతం భక్తుల భక్తిపారవశ్యంతో గరుడునిపై కటాక్షించాడు. పౌరణిక నేపథ్యంలో 108 వైష్ణవదివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను గోదాదేవి ప్రత్యేక పూలమాలలను ,సహస్రనామమాలను,చెన్నైనుంచి తీసుకువచ్చిన అలంకృత ఛత్రాలు స్వామివారి గరుడవాహనసేవకు మరింత శోభను చేకూర్చాయి. జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేశాడు. మెల్లగా మాఢవీధుల్లో వేచివున్న భక్తజనానికి స్వామివారు నేనున్నానంటూ అభయమిచ్చాడు. ఈవాహనసేవలో పెద్దజీయర్ స్వామి,చిన్నజీయర్‌స్వామి,టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు శాంతారాం,భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ మురళీ కృష్ణ, ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్ వర్మ ,ఆలయ పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గరుడసేవలో ఎమ్మెల్యే నానిని అడ్డుకున్న విఎస్ఓ

### అలిగి వెనక్కువెళ్ళిన ఎమ్మెల్యే -నచ్చజెప్పిన తిరుపతి ఎస్పీ

తిరుపతి, సెప్టెంబర్ 19ప్రభాతవార్త:
గరుడసేవ వాహనసేవలో స్వామిదర్శనానికి విచ్చేసిన ప్రముఖుల్లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని ఉన్నారు. ఆయన్ను వాహనమండపం వద్ద టిటిడి విఎస్ఓ అల్లం సురేంద్ర అడ్డుకున్నారు. ఎమ్మెల్యేనంటూ చెబుతున్నా విఎస్ఓ వినిపించుకోకుండా గ్యాలరీలోకి వెళ్ళాలని నిలదీశారు. దీంతో నాని చేసేదిలేక ఆవేదనతో గరుడసేవ దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగివెళ్లిపోయారు. అయితే ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు రాంభగీచా గేట్ వద్దకు వెళ్ళి నానికి నచ్చచెప్పారు. వెనక్కుపిలిచుకు వచ్చినా నామోషిగానే నాని వాహనం వద్ద నుండి తిరిగి వెళ్ళిపోయారు. మరీ ఈ సంఘటన ఎక్కడకు దారితీస్తుందనేది టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది.

## వృషభవాహనంపై

# ఊరేగిన ఏకదంతుడు

కాణిపాకం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:



కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి సిద్ధిబుద్ధి సమేతుడైన గణనాధుడు వృషభవాహనంపై కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అభయ హస్తం అందించారు. బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామివారికి ఉదయం చిలుకవాహనసేవ, రాత్రి వృషభవాహనసేవ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. రాత్రి జరిగిన కార్యక్రమానికి కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరు శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయ దారులు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి ఉత్సవమూర్తులకు ఆలయ అలంకార మండపంలో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి దేధీప్యమానంగా అలంకరించి ధూపధీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే రాత్రి అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు అందుకున్న అనంతరం రంగురంగుల విద్యుత్ దీపాలు, వివిధరకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన వృషభవాహనంపై వుంచి మంగళవాయిద్యాలు, కోలాటాలు, వంటి సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామపురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులకు నారికేళ కర్పూరహారతులతో భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్,ఆలయ సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి,టెంపుల్ ఇన్స్ పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవా 2026 పై కలెక్టర్ సమీక్ష

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్, 19 ప్రభాతవార్త:



జిల్లాలో స్వచ్ఛతా హి సేవా 2026 కార్యక్రమం అమలుపై జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు మరియు మున్సిపల్ సిబ్బందితో శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లు , కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని శాఖలు, స్థానిక సంస్థలు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో స్పష్టమైన, శాశ్వతమైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజల్లో అవగాహన మరియు ప్రజల భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ శాఖలు, క్షేత్రస్థాయి సిబ్బంది మరియు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల నిర్వహణకే పరిమితం కాకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత , పారిశుధ్య నిర్వహణలో శాశ్వతమైన మెరుగుదలలు సాధించే విధంగా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల అమలును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్వహించిన కార్యక్రమాలను సమగ్రంగా డాక్యుమెంట్ చేసి, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన తిరుపతి జిల్లా సాధన దిశగా స్వచ్ఛతా హి సేవా 2026ను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## గరుడోత్సవంలో శ్రీ కళ్యాణ వెంకన్న వైభవం

### గోవింద నామస్మరణలతో మారుమోగిన తుమ్మలగుంట



తిరుపతి రూరల్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:
తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో వెలసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గరుడోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి అవతారంలో తన ప్రీతిపాత్రుడైన గరుత్మంతుని వాహనంగా ఎక్కి స్వామివారు తుమ్మలగుంట పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామస్మరణల మధ్య గ్రామమంతా భక్తిరసంతో నిండిపోయింది. "గోవింద... గోవింద..." అంటూ మారుమోగిన నినాదాలతో తుమ్మలగుంట ఆధ్యాత్మిక వాతావరణంలో తేలిపోయింది. వాహన సేవలో చెవిరెడ్డి కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. మరోవైపు కళాబృందాల ప్రదర్శనలు శ్రీవారి వైభవాన్ని మరింత ప్రతిబింబించాయి. ఈ గరుడోత్సవం సందర్భంగా తుమ్మలగుంటలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి రాజసం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

## రేపటినుంచి సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన



కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఈనెల 21, 22తేదీల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో దాదాపు 9వేల కోట్ల వ్యయంతో చేపట్టే హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఎఎం) ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నారు. అలాగే కుప్పం ప్రాంత రైతుల కోసం శ్రీశైలం నుంచి తెప్పిస్తున్న కృష్ణా జలాలకు సిఎం చంద్రబాబు జలహారతి ఇస్తారు. అలాగే కుప్పంలో ప్రభుత్వ పథకాల్లో లబ్ది పొందిన లబ్దిదారులతో సమావేశం కావడంతో పాటు కుప్పంలో జరిగే బహిరంగసభలో ప్రసంగిస్తారు. కుప్పంలో ఆర్డీఓ, డిఎస్పీ నూతన కార్యాలయ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. రెండోరోజు పార్టీ శ్రేణులతో సమావేశం అవుతారు. సిఎం కుప్పం పర్యటన వివరాలిలా.. 21న బెంగళూరునుంచి బయలుదేరి ఉదయం 10.30గంటలకు శాంతిపురం మండలం తుమ్మిశి హెలికాప్టర్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజలనుంచి వినతుల స్వీకరణ అనంతరం 10.55గంటలనుంచి 11.15గంటల వరకు గుండిశెట్టిపల్లి వద్ద జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. 11.30గంటలకు కుప్పం బైపాస్‌రోడ్‌లో రైతు బజార్ నిర్మాణంకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 11.50నుంచి 1.30గంటలదాకా కొత్తపేటలో జరిగే బహిరంగసభ, అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు చేస్తారు. లబ్దిదారులతో సమావేశం అవుతారు.అనంతరం స్వగృహంకు చేరుకుంటారు. రాత్రి 9.30గంటలకు కుప్పం రైల్వేస్టేషన్ చేరుకుని రైల్వే ప్రాజెక్టులపై ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం 11.15గంటలకు స్వగృహం చేరుకుంటారు. 22న ఉదయం 11గంటలకు కడపల్లిలోని తమ నివాసం సమీపంలో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో 9వేల కోట్లతో చేపట్టే హైబ్రిడ్ యానిటీ మోడల్ (హెచ్ఎఎం) ప్రాజెక్టును ప్రారంభిస్తారు. అక్కడే ఎకో కోళ్ల పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 2-4గంటల మధ్య పార్టీ శ్రేణులతో సమావేశం అవుతారు. సాయంత్రం 4.20గంటలకు తుమ్మిశి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.

# గరుడ"కష్టాల"కొండ

### -మధ్యాహ్నం 1గంటకే గేట్లకు తాళాలు
### -బందీఖానాలా ఎక్కడికక్కడ నియంత్రణ

తిరుమల,సెప్టెంబర్ 19 ప్రభాతవార్తప్రతినిధి: :
దేశంనలుమూలల నుండి భక్తులు తిరుమలకు వచ్చి స్వామివారి వాహనసేవలవీక్షణతో ముక్తులవ్వండి అని పిలుపునిచ్చిన టిటిడి పెద్దలు, అధికారులు ఉత్సవాల్లో ఐదవరోజు ఉదయం అందుకు భిన్నంగా వ్యవహరించారు. ఎంతో విశిష్టత ఉన్న గరుడవాహనసేవ వీక్షణకు అశేషభక్తజనం విచ్చేశారు. ఉదయం నుండే ఎటుచూసినా భక్తులు జనసంద్రంగా మారారు.తిరుమలేశునికిసాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలలో శనివారం రాత్రి గరుడవాహనసేవ పవిత్రత, విశిష్టత సంతరించుకుంది. గరుడవాహనాన్నివీక్షిస్తే ముల్లోకాల్లో భక్తుల పాపాలు పటాపంచలవుతాయని పురాణ విశ్వాసం. అంతటి విశిష్టత వున్న గరుడసేవ తమిళపెరటాసి మాసం తొలిశనివారం రావడంతో తిరుమలగిరులు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం మోహినీ అవతార వాహనానికి ఆలయమాఢవీధుల్లోని గ్యాలరీలు దాదాపు నిండిపోయాయి. ఎండకు ఏమాత్రం భక్తులు జడవక అలాగే కూర్చున్నారు. మధ్యాహ్నం 12.30గంటలకే తిరుమలపద్మవ్యూహంలా మారింది. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో మాఢవీధులు గ్యాలరీలు నిండిపోవడం...ఆపై వచ్చిన భక్తులు రోడ్లపైనే తిరుగుతూ కనిపించారు. ఆర్టీసి బస్టాండు నుండి ఆనందనిలయంవరకు చేరుకునే కల్యాణకట్ట, ఆస్థానమండపం, రాంభగీచా, ఎస్వీమ్యూజియం మార్గాల్లో గేట్లను మధ్యాహ్నానికే మూసివేశారు. ఎటుచూసినా తాళాలు వేసిన గేట్లు భక్తులకు కనిపించడంతో ఎటువెళ్ళాలో తెలియక సతమతమయ్యారు. బ్రహ్మోత్సవాల్లో గరుడవాహనసేవను వీక్షించేందుకు భక్తులు ఎక్కువగానే తిరుమలకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12గంటలకు తిరుమలలో ఆలయ దక్షిణ, ఉత్తర,పడమర మాఢవీధుల గ్యాలరీలు నిండిపోయాయి. భక్తులకు గ్యాలరీల్లో ఉదయం 11గంటలనుండి నిరంతరాయంగా భక్తులకు సాంబారన్నం, పెరుగన్నం, బిస్మిల్లాబాత్, సాయంత్రం సుండలు, తదితర



అన్నప్రసాదాలు,తాగునీరు, మజ్జిగ పంపిణీచేశారు.

**-ప్రవేశగేట్లవద్దతప్పని తోపులాటలు:**
నాలుగుమాఢవీధులు గ్యాలరీలు నిండిపోవడంతో ఆ తరువాత భక్తులను ఎక్కడా అనుమతించలేదు. ఎక్కడివారిని అక్కడే ఆపివేశారు. సాయంత్రం 3గంటలతరువాత భక్తులను లోనికి అనుమతించకపోడంతో చాలావరకు పోలీసులతో గొడవకు దిగారు. గరుడవాహనసేవకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు,టిటిడి పటిష్ట ఏర్పాట్లుచేసింది. క్షుణ్ణంగా తనిఖీచేసిన తరూవాత భక్తులను గ్యాలరీల్లోకి అనుమతించారు.

-నిరంతరాయంగా అన్నప్రసాదాలు:
గరుడసేవ వీక్షణకు వచ్చిన భక్తులకు గ్యాలరీల్లో వున్నవారందరికీ ఉదయం 11గంటలనుండి నిరంతరాయంగా భక్తులకు సాంబారన్నం, పెరుగన్నం, బిస్మిల్లాబాత్, సాయంత్రం సుండలు, తదితర 15రకాల అన్నప్రసాదాలు,తాగునీరు, టీ, మజ్జిగ పంపిణీచేశారు.అన్నప్రసాదం విభాగం అధికారులు నిరంతర కృషితో శ్రీవారి సేవకులు, స్కౌట్స్ గైడ్స్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీచేశారు.

# పరిశుభ్ర చిత్తూరు లక్ష్యంగా విధులు

## ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాల పిలుపు



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నాయుడు

చిత్తూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

పరిశుభ్ర చిత్తూరు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించి చిత్తూరును పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు లు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛతాహి సేవ 2026 కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు లక్ష్మీ నగర్ కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. చిత్తూరు నగరం ను పరిశుభ్రంగా ఉంచడం కోసం ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. గృహాలలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వస్తువుల వినియోగమును పూర్తిగా తగ్గించాలని, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయరాదని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నాయుడు ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది, ప్రజలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు, ఈ కార్యక్రమంలో చూడ చైర్ పర్సన్ కటారి హేమలత, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ అనిమెని ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రంగా పరిసరాలు: ఎమ్మెల్యే మురళీమోహన్



చిత్తూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

మనం నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ 21వ డివిజన్ వరికివిల్లిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ మొక్కలు నాటి నీరు పోసారు. అనంతరం ఎమ్మెల్యే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరాలు, పట్టణాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం పారిశుద్ధ్యం నిర్వహణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, పర్యావరణ కార్యదర్శిలు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సత్వరం ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లింపు

## ఏబీవీపీ డిమాండ్

చిత్తూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను సత్వరం చెల్లించాలని, జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని జిల్లా ఏబీవీపీ కన్వీనర్ హర్షవర్ధన్ డిమాండ్ చేశారు. విద్య రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు అధికంగా ఉన్నాయని వీటిని పరిష్కరించడానికి ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు 6000 కోట్లకు పైగా ఉన్నాయని వీటిని సత్వరం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పి జి విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 ను సత్వరం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు హేమ చరణ్ రెడ్డి, తేజ సూర్య రెడ్డి, దొరబాబు, పెద్ద సంఖ్యలో ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటిపై కూలిన చింతచెట్టు...తప్పిన ప్రమాదం

పెద్దపంజాణి, సెప్టెంబర్19 ప్రభాతవార్త:



మండలంలోని బట్టందొడ్డి పంచాయతీ బనకందొడ్డి గ్రామంలో ఓ ఇంటిపై చింతచెట్టుకూలిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో ప్రమాదం తప్పింది. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామంలో రెడ్డెప్ప కుటుంబీకులు నివాసముంటున్నారు. వీరిఇంటి పక్కనే పురాతనకాలంనాటి చింతచెట్టు ఉంది శనివారం హఠాత్తుగా చింతచెట్టుకూలి ఇంటిపై పడింది. దీంతో ఇంటిగోడలు ఇంటిపైకప్పు కొంతమేరా దెబ్బతింది. సంఘటనపై బాధితుడు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదుచేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు అధికారులను కోరారు.

# మంచి ప్రభుత్వానికి మద్దతు

## ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



ప్రజలకు మంచి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మద్దతుగా నిలవాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజా దర్బార్ లో చిత్తూరు అర్బన్ పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ద్వారా ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను ఎంపీ దగ్గు మళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సౌకర్యాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో జరగనంత అభివృద్ధి ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చూడ చైర్ పర్సన్ కటారి హేమలత, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తెలుగుదేశం పరిశీలకురాలు కుమారి, కూటమి నాయకులు అల్లూరి శ్రీనివాసులు, మాజీ డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు నళిని, క్లస్టర్ ఇంచార్జి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీచే సిఎం పర్యటన భద్రత ఏర్పాట్లు పరిశీలన

కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

ఈనెల 21,22 తేదీల్లో సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన నేపథ్యంలో కుప్పం పట్టణంలో సిఎం పర్యటన ప్రాంతాలను కుప్పం ఎస్పీ బొడ్డు హేమంత్ పరిశీలించారు. స్థానిక కొత్తపేట ప్రాంతంలో సిఎం బహిరంగసభ ప్రదేశం, రైతుబజార్ శంకుస్థాపన స్థలం ప్రాంతాలు పరిశీలించి భద్రత ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.




# సిఎం పర్యటన విజయవంతం చేయాలి

## - ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

కుప్పం ప్రజల ఆరాధ్యదైవం సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం కోరారు. శనివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన సిఎం పిఎ శ్రీకాంత్‌తో కలసి మాట్లాడారు. ఈనెల 21,22 తేదీల్లో సిఎం చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తారని చెప్పారు. కుప్పం ప్రాంతంలో రైతుల సౌకర్యార్థం మరోవిడత కృష్ణాజలాలు కుప్పంకు సిఎం తెస్తున్నారని శాంతిపురం మండలంలో కృష్ణమ్మకు సిఎం చంద్రబాబు జలహారతి చేపడ్తారన్నారు. అలాగే కుప్పంలో రైతు బజార్ నిర్మాణంకు శంకుస్థాపన, అభివృద్ధి పనులకు శంకుస్థాపన, బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. పర్యటనలో భాగంగా ఏనుగుల సమస్యలపై అధికారులతో చర్చించడంతో పాటు కుప్పంలో దాదర్, గోవా రైళ్ల స్టాపింగ్‌కు జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. రెండో రోజు 9వేల కోట్లతో చేపట్టే హైబ్రిడ్ యానిటీ మోడల్‌ను సిఎం చంద్రబాబు కడపల్లి వద్ద ప్రారంభించిన అనంతరం మధ్యాహ్నం పార్టీ శ్రేణులతో సమావేశం జరుపుతారన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలు, కార్యకర్తలు సిఎం పర్యటన జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ సిఎం పిఎ మనోహర్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మండల అధ్యక్షులు రాజగోపాల్, ఉదయ్, వెంకటరమణ, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, వివిధ హోదాల్లో గల నేతలు పాల్గొన్నారు.

# గిన్నిస్‌వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకున్న కలెక్టర్



కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఈఏడాది జనవరి 31న లబ్ధిదారులకు ఒకేరోజు 3742 ఇ - సైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సృష్టించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఇ -మోటారాడ్ సంస్థ, కడ, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కాన్పూర్ ఐఐటి, హరిశంకర్‌లు ఈ రికార్డులో కీలకపాత్ర పోషించారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ), చిత్తూరు జిల్లా కలెక్టరేట్, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ రికార్డును సాధించాయి. కుప్పంలో పర్యావరణ హిత ం, కాలుష్య నియంత్రణ కోసం సిఎం చంద్రబాబునాయుడు ఇ- సైకిళ్లను కుప్పం ప్రజలకు రాయితీతో రూ 24వేలకే అందించేలా చర్యలు చేపట్టిన విషయం విదితమే. ప్రస్తుతం ఇ - సైకిళ్లకు సంబంధించి కుప్పంలోనే ఇ -మోటారాడ్ సంస్థ సర్వీస్ సెంటర్‌ను సైతం ఏర్పాటుచేసింది.

# కాణిపాకం దేవస్థానంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

కాణిపాకం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:




రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర దేవాదాయ, దర్మధాయశాఖ ఆదేశాల మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స వ్చఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం అతిథి గృహం వద్ద మొదటగా సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది దేవస్థానం అతిథి గృహం నుండి ర్యాలీ నిర్వహించి ఆలయ మాడా వీధులు, బస్టాండు పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకంపై భక్తులకు, వ్యాపారస్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, శానిటరీ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





కాణిపాకం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానం బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం జరిగిన చిలుక, వృషభవాహనసేవల సందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం చిలుక వాహనసేవ, రాత్రి వృషభవాహనసేవ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కాలక్షేపం నిమిత్తం స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి రాత్రి వరకు రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే వివిధ రకాల సాంస్కృతిక, కళా ప్రదర్శనలను దేవస్థానం, ఉభయదారులు ఏర్పాటు చేశారు. ఈమేరకు భక్తిరంజని, హరికథలు, భక్తిగీతాలు, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి

### - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ కలలను సాకారం చేసుకోవాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. శనివారం కుప్పం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో రాష్ట్ర విద్యా,ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించిన యువత భవిత కార్యక్రమంను చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ దశనుంచే భవిష్యత్తుకు గట్టి పునాది వేసుకోవాలన్నారు. ఉన్నత విద్య, ఉపాధిఅవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ లక్ష్యాల గురించి వివరించారు. యువత అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటే సమాజం, రాష్ట్రం మరి ంత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో తెచ్చిన సంస్కరణలు విద్యార్థుల భవితకు బంగారుబాటగా మారుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, కడ సభ్యులు రాజ్‌కుమార్, వెంకటేష్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వినాయక నిమజ్జనాలు

రామకుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



మండల కేంద్రంలో నెలకొల్పిన వినాయక ప్రతిమలను యువకులు ఉత్సాహంగా పాల్గొని నిమజ్జనాలు నిర్వహించారు. శనివారం రెడ్డి వీధి, కోదండరాం నగర్ కాలనీ, కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకులను ట్రాక్టర్ల సహాయంతో గ్రామ పురవీధుల్లో డప్పులు వాయిస్తూ బాణా సంచా పేలుస్తూ ఊరేగించారు. అడుగడుగున భక్తాదులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతిలిచి మొక్కలు తెచ్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి యువత తరలివచ్చి వినాయక ఊరేగింపులో పాల్గొని స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదాన ప్రసాదాలు పంచిపెట్టారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 16మంది ఎంపిక

కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



లయన్స్‌క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ అధ్వర్యంలో శనివారం స్థానిక పిఇఎస్ అర్బన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఉచిత కంటి, చక్కెర వ్యాధి శిబిరంకు విశేష స్పందన లభించింది. మొత్తం వంద మందికి పైగా ప్రజలకు వైద్యులు కంటి, మధుమేహ పరీక్షలు జరిపారు. వారిలో 16మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమం లో లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, అధ్యక్షుడు పిజి సెల్వం, డైరెక్టర్లు జయరాంనాయుడు, కృష్ణమూర్తి, లియోఇంపాక్ట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైకాపా నుంచి ఇరవై కుటుంబాలు తెదేపాలో చేరిక



కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

మండలంలోని చెక్కునత్తం పంచాయతీలో శనివారం తెదేపా పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఇరవై కుటుంబాలు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈసందర్భంగా వారికి ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి తదితరులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలు తమకు నచ్చడంతో తాము తెదేపాలో చేరుతున్నట్లు నారాయణ, అశోక్, పుష్పరాజ్, గోవిందన్, పట్టు, కనుగు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర, కనీసవేతనాల మండలి సభ్యుడు శరవణ, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, నేతలు పోస్ట్‌మెన్ తిమ్మప్ప, శ్రీనివాసులు, విభూషణ్, కన్నన్, శివకుమార్, మునిరత్నం, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుభాష్‌రాజా పేర్కొన్నారు. శనివారం పిహెచ్‌సి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంను ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని స ంరక్షించాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ వినియోగం తగ్గిండంతో పాటు ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఎఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపా నేతచే అంత్యక్రియలకు పదివేల ఆర్థికసాయం



కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

స్థానిక కొత్తపేట ఇందిరాకాలనీ 14వార్డులో నివాసం ఉంటున్న దివ్య కిడ్నీ సమస్యతో బాధపడుతూ మృతి చెందింది. ఈమెతనకు వస్తున్న పెన్షన్ నగదుతో కుమార్తె, మానసిక బాధితుడైన భర్తతో కలసి జీవించేది. ఈమెది నిరుపేద కుటుంబం కావడంతో సిఎం చంద్రబాబునాయుడు తరపున దివ్య అంత్యక్రియలకు కొత్తపేట యూనిట్ ఇన్‌చార్జ్ అప్పు ముఖేష్ పదివేల రూపాయల ఆర్థికసాయం అందించి తనలోని మానవత్వాన్ని మరోమారు చాటుకున్నారు. కార్యక్రమంలో నేతలు సుకుమార్, మునస్వామి, శివకుమార్, అలగేష్, వినోద్ పాల్గొన్నారు.

# మానవ సంబంధాలకు అద్దం పట్టిన మరో ముఖం కథలు

## ఎస్వీయూలో కథా సంపుటి ఆవిష్కరణ.. రచయిత జిల్లేళ్ల బాలాజీకి అభినందనలు..



తిరుపతి విద్య సెప్టెంబర్ 19 ప్రభాత వార్త

సమాజంలోని వాస్తవ పరిస్థితులు, మానవ సంబంధాలు, సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించే సాహిత్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎస్వీయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. చెంద్రాయుడు అన్నారు. ప్రముఖ రచయిత జిల్లేళ్ల బాలాజీ రచించిన మరో ముఖం కథా సంపుటిని శనివారం ఎస్వీయూ సెనేట్ హాల్లో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. చెంద్రాయుడు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. భూపతి నాయుడు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సభాధ్యక్షత వహించిన ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.సి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లేళ్ల బాలాజీ రచనలు సమాజంలోని సామాజిక సమస్యలు, వికృత పోకడలను పాఠకుల ముందుకు తీసుకువస్తున్నాయని అన్నారు. సమాజ పరిణామాలను నిశితంగా పరిశీలించి కథా రూపంలో ఆవిష్కరించడం రచయిత ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. రాజేశ్వరమ్మ మాట్లాడుతూ జిల్లేళ్ల బాలాజీ కథలు మానవ సంబంధాలను సహజంగా, హృద్యంగా చిత్రించాయని తెలిపారు. కుటుంబ సంబంధాలు, మానవ విలువలు, సామాజిక బాధ్యత, నైతికత వంటి అంశాలు ఆయన రచనల్లో ప్రతిఫలిస్తున్నాయని అన్నారు. తెలుగు విభాగం విశ్రాంతాచార్యులు మేడిపల్లి రవికుమార్ కథా సంపుటిని సమీక్షి స్తూ సామాన్య ప్రజల జీవితాలు, సమస్యలు, సంఘర్షణలు, భావోద్వేగాలను రచయిత తన కథల్లో ప్రతిబింబించారని పేర్కొన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.వి. మురళీధర్ మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని ఆలోచింపజేసి మార్పు దిశగా నడిపించే శక్తి కలిగిందన్నారు. రచయిత జిల్లేళ్ల బాలాజీ తన రచనలకు సమాజంలోని జీవన పరిస్థితులే ప్రేరణగా నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో మరో ముఖం కథా సంపుటి తొలి ప్రతిని చిత్తూరు గూడ్స్ అండ్ టాక్స్ అధికారి నాగభూషణం స్వీకరించారు. అనంతరం రచయితను పలువురు సాహితీవేత్తలు, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్వీయూ కల్చరల్ అఫైర్స్ కోఆర్డినేటర్ వివేక్, తెలుగు గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ అశోక్, డాక్టర్ ఆదిశేషయ్య, పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రసన్న వెంకటేశ్వరునికి వైభవంగా గ్రామోత్సవం

వడమాలపేట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:



అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం సాయంత్రం ఊంజల్‌సేవ, గ్రామోత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువ జామునసుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అలంకరణ అనంతరం భక్తులను సర్వ దర్శనానికి అనుమతించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారిని ఊయలలో కొలువుదీరారు. చిద్విలాసంగా గంటపాటు ఊయలలూగుతూ శ్రీనివాసుడు భక్తులను కటాక్షించారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడా వీధుల్లో విహరించారు. భక్తులు ధూపదీప నైవేద్యాలు స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు మణికంఠ స్వామి, రమణాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ముక్కోటి ఆలయ అభివృద్ధిపై దేవాదాయ మంత్రికి వినతి

### అగస్త్యేశ్వర స్వామి ఆలయ సందర్శనకు ప్రత్యేక ఆహ్వానం

### బిజెపి నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి



చంద్రగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:

తొండవాడ స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆనందవల్లీ అమ్మవారి వారి ముక్కోటి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ తిరుపతికి చెందిన బిజెపి నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ముక్కోటి ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళిరెడ్డి సూచనల మేరకు.. నెల్లూరులోని మంత్రి నివాసంలో శనివారం టిడిపి సీనియర్ నాయకుడు మొక్కల కుమార్ రాజారెడ్డి, ఆయన తనయుడు మొక్కల సుభాష్ శ్రీకర్ రెడ్డిలతో కలసి ఆయన మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు ముక్కోటి ఆలయ విశిష్టతను వివరించి, ఆలయ డైరీని అందజేసి, ఒకమారు ఆలయ సందర్శనకు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు.. ప్రస్తుత ఆలయ ధర్మకర్త ముక్కోటి ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూ పెద్దఎత్తున అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు. ఆలయ ఆవరణలో చేపట్టిన నిర్మాణ పనులను వివరించి, దేవాదాయశాఖ ద్వారా ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. దీనిపై మంత్రి తొండవాడ గ్రామంతో పాటు ముక్కోటి ఆలయంతో తనకు గల ప్రత్యేక అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చారిత్రక ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో దేవాదాయ శాఖ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టమైన హామీ ఇచ్చారు. త్వరలోనే ఆలయ సందర్శనకు రాగలని అన్నారు. మంత్రి సానుకూల స్పందన పట్ల ఆయనకు వారు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అక్టోబరు 13 వరకు ప్రవేశాలు



తిరుపతి విద్య సెప్టెంబర్ 19 ప్రభాత వార్త

చదువు కొనసాగించాలనుకున్నా వివిధ కారణాలతో రెగ్యులర్ కళాశాలకు వెళ్లలేకపోతున్న వారికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవకాశం కల్పిస్తోంది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో ఉన్న విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రంలో డిగ్రీ, ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును అక్టోబరు 13వ తేదీ వరకు పొడిగించినట్లు కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. కిరణ్‌కుమార్ రాజు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతోపాటు బీఎల్ఐఎస్సీ ఒక సంవత్సరం కోర్సులో చేరేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలు, ఇతర కారణాల వల్ల చదువు మధ్యలో నిలిపివేసిన వారు ఓపెన్ యూనివర్సిటీ విధానాన్ని వినియోగించుకుని ఉన్నత విద్యను కొనసాగించవచ్చని పేర్కొన్నారు. ప్రవేశాలకు ఆసక్తి ఉన్న విద్యార్థులు అక్టోబరు 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు విధానం, కోర్సులు, ప్రవేశానికి సంబంధించిన ఇతర వివరాలను అధ్యయన కేంద్రంలో తెలుసుకోవచ్చన్నారు.

## ఫార్మసీ డిప్లొమాకు 21న స్పాట్ అడ్మిషన్లు..

### విద్యార్థినులకు ఉచిత హాస్టల్ సౌకర్యం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త




ఫార్మసీ డిప్లొమా చదవాలనుకునే విద్యార్థినులకు చివరి అవకాశంగా శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లకు సిద్ధమైంది. టీటీడీ ఆధ్వర్యంలోని ఎన్‌బీఏ గుర్తింపు పొందిన కళాశాలలో డిప్లొమా ఇన్ ఫార్మసీ (డీపీఎచ్) కోర్సులో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 21న నేరుగా ప్రవేశాలు నిర్వహించనున్నారు. సీట్లు పరిమితంగా ఉండటంతో అర్హత ఉన్న విద్యార్థినులు ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అనంతరం 21న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. విద్యార్థినులు విద్యార్హత సర్టిఫికెట్ల ఒరిజినల్స్‌తోపాటు మూడు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకుని నేరుగా హాజరుకావాలి. ఈ ప్రవేశాల్లో మరో ప్రత్యేకత విద్యార్థినులకు అందించే హాస్టల్ వసతి. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, కళాశాల తరఫున ఉచిత హాస్టల్ సౌకర్యం కల్పించనున్నారు. దీంతో ఫార్మసీ డిప్లొమాలో చేరాలనుకునే విద్యార్థినులకు కోర్సుతోపాటు వసతి సౌకర్యం కూడా లభించనుంది.

## ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చారిత్రాత్మక నిర్ణయం

### ఎంఎల్‌ఏ పులివర్తి నాని

రామచంద్రాపురం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:



ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చారిత్రాత్మక నిర్ణయమని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. శనివారం కమ్మపల్లిలో కమ్మపల్లి, కెకెవి పురం రెవెన్యూ గ్రామాల రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేను అత్యంత పారదర్శకతతో నిర్వహించి రైతులకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పాసు పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్టును తీసుకువచ్చి రైతుల భూములకు భద్రత లేకుండా చేసిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. 2014 నుండి 2019 వరకు పెండింగ్‌లో వున్న హౌసింగ్ బిల్లులను చెల్లించడమే కాకుండా నూతనంగా సుమారు 2 వేల ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు, తహశీల్దార్ మధుసూదన్ రావు, ఎంపిడిఓ పులిరామ్ సింగ్, డిప్యూటీ ఎంపిడిఓ తేజోవతి, విఆర్‌ఓ ప్రదీప్, మాజీ ఎంపిటిసి పాలడుగు సురేష్, నాయకులు రావిళ్ళ గిరి, నీలకంఠ చౌదరి, జెడి జగన్, ఆరి లీలామోహన్, కొట్టే నరశింహారెడ్డి, తాతిరెడ్డి వెంకటేష్ రెడ్డి, కొట్టే గిరిధర్ రెడ్డి, మునిరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన ఎదుగుదల



రేణిగుంట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో కీలకమని రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. పోషణ మాస ఉత్సవాల్లో భాగంగా రేణిగుంట మండలం కుమ్మరపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కే. కృష్ణవేణి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, కిశోర బాలికలు, చిన్నారులకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిన్నారుల జీవితంలో మొదటి 1000 రోజుల ప్రాధాన్యత, పోషణ ట్రాకింగ్, జన ఆందోళన్ కార్యక్రమాల ఉద్దేశాలు, సమతుల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.. వయస్సు, శారీరక అవసరాలకు అనుగుణంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలు, వివిధ రకాల పోషకాహార పదార్థాల వినియోగం గురించి తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, స్వచ్ఛమైన పరిసరాలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఎంతో అవసరమని తెలిపారు. కుటుంబ స్థాయి నుంచే పోషకాహారంపై అవగాహన పెంపొందించడం ద్వారా పిల్లలు, మహిళల ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరచవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమవతి, డాక్టర్ ఉదయశ్రీ, బహుళ ప్రయోజన ఆరోగ్య విస్తరణ అధికారి నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు వాసంతి, గీత, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:



పుత్తూరు మండలంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి. కుమార్ తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో మహిళా రక్షణ సెల్‌చైర్మన్ కె.జానకమ్మ ఆధ్వర్యంలో ఈ ఉచిత శిబిరం నిర్వహించామని తెలియజేశారు. పరమేశ్వరమంగళం సమీపంలోని అన్నాగౌరి మెడికల్ కాలేజీ, ఆస్పత్రిసహకారంతో నిర్వహించామని తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఈఎన్‌టీ నేత్ర వైద్యం, దంత వైద్యం విభాగాలకు చెందిన వైద్యనిపుణులు పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యసలహాలు, ఆరోగ్య సూచనలు అందించారన్నారు. మహిళా రక్షణ సెల్ చైర్మన్ కె.జానకమ్మ శిబిరంలో చురుకుగా పాల్గొని, మహిళల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య బృందంలో డా. శ్రీహర్షనందా(జనరల్ మెడిసిన్), సుష్మిత(వోబీజీ), కె.జాగృతి (ఈఎన్‌టీ), ప్రమీల(ఆప్తాల్మాలజీ), వినాయక్(డెంటల్) పాల్గొన్నారు. శిబిరంలో నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మసిస్ట్ తదితర సిబ్బంది సమన్వయంతో వైద్య సేవలను అందించారు. విద్యార్థులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు మందులు, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సలహాలు అందించారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సాంకేతిక సిబ్బంది, నిర్వాహకులు సమన్వయంతో పనిచేసి శిబిరాన్ని విజయవంతం చేశారు.

## పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎంపీడీవో

కేవీబీపురం, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:




కేవీబీ పురం మండలంలోని పోలింగ్ స్టేషన్లను ఎంపీడీవో మాలతి పరిశీలించి కలర్ వేయించారు. శనివారం మండల కేంద్రమైన కేవీబీ పురం మండలంలోని ఎంపీటీసీల పోలింగ్ స్టేషన్లను ఎంపీడీవో కలర్ వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల సహకారంతో పోలింగ్ స్టేషన్లను ఏకగ్రీవంగా ఏర్పాటు చేశామని ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలింగ్ మిషన్లను ఖరారును జిల్లా స్థాయి అధికారులకు పంపించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఎంపీడీవోతో పాటు ఈవోపీఆర్డీ పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో, ఏపీఎం, పంచాయతీ అధికారులు తదితరులు ఉన్నారు.

## ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలి



రేణిగుంట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారి పిల్లల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి వెంకటాద్రి యాదవ్ ఆకాంక్షి ంచారు. ఉద్యోగుల సంక్షేమం, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన ఆర్యసీ సభ్యుడిగా సీనప్ప ఎన్నికైన సందర్భంగా శనివారం సీఆర్ఎస్ గ్యారేజ్‌లో ఉద్యోగులు, వివిధ ట్రేడ్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఉద్యోగుల పిల్లల విద్యకు అవసరమైన సహకారం అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. సీనప్ప తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షి ంచారు. అనంతరం సీనప్పను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా కార్యదర్శి వెంకటాద్రి యాదవ్‌తో పాటు ట్రేడ్ యూనియన్ నాయకులు మురుగప్రసాద్, బాబు, ఓబీసీ నాయకుడు రమణ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రేణిగుంట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:

అనారోగ్య సమస్యలు ఏర్పడి బాధపడటం కంటే సమస్యలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సన్రైజ్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ అన్నారు. రేణిగుంట పట్టణంలోని జీఎం స్ట్రీట్‌లో శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆరో రోజు సన్రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సన్రైజ్ హాస్పిటల్ చైర్మన్ ఎస్.బి.ఆర్. భాష, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ రెడ్డి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు షుగర్, రక్తపోటు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సందీప్ రెడ్డిని ఘనంగా సత్కరించి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా తమ ఆసుపత్రి తరఫున ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రేణిగుంటలో నూతనంగా ఏర్పాటైన సన్రైజ్ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జూలియన్ రాజు మాట్లాడుతూ సన్రైజ్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించడం సంతోషకరమని పేర్కొన్నారు. వైద్య శిబిరం నిర్వహించిన ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు యోగానంద్, గోపికృష్ణ, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్లు పురుషోత్తం, తేజ, అభయ వినాయక అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు సుమన్, కళ్యాణ్, పవన్, ప్రభు, మురళి, ధనుంజయ్, హేమాద్రి, మస్తాన్, ప్రదీప్, సుబ్బు, ఆసుపత్రి సిబ్బంది దినేష్, సేలం, ఈశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## సీజీటీం ఆధ్వర్యంలో అన్నదానం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని కాపువీధిలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి, మండపం ఆవరణలో సీజీటీం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం మండపంలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు. అలాగే పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులో వినాయక చవితి సందర్భంగా మండపంలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి ప్రతిమను భక్తిశ్రద్ధలతో విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక పుష్పాలతో డప్పు వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు.

# జ్వరం తీవ్రతతో బాలుడు మృతి

నాగలాపురం, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:

జ్వరాల తీవ్రతతో చికిత్స పొందుతున్న 9వ తరగతి విద్యార్థి మృతి చెందడంతో నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూరినాయుడు కండ్రిగలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో గత పది రోజులుగా జ్వరాలు విజృంభిస్తుండగా పలువురు చిన్నారులు, పెద్దలు జ్వరాల బారిన పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో తీవ్ర జ్వరంతో వారం రోజులుగా చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అదే గ్రామానికి చెందిన కార్తీకేయన్(13) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన కార్తీకేయన్ మృతితో తల్లిదండ్రులు రవి, జయ దంపతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుమారుడికి తీవ్ర జ్వరం రావడంతో తొలుత స్థానికంగా వైద్యం అందించిన తల్లిదండ్రులు పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారం రోజులుగా చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి మృతి చెందాడు. చదువుకుంటూ భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న కుమారుడు ఇక లేడన్న వార్తతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

### న గ్రామంలో జ్వరాలపై ఆందోళన

కస్తూరినాయుడు కండ్రిగలో వరుసగా జ్వరాలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. పలువురు చిన్నారులు, పెద్దలు జ్వరాలతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.





విద్యార్థి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, విద్యార్థి కార్తీకేయన్(ఫైల్‌పోటో)

### న ఇంటింటి సర్వే నిర్వహించి పరీక్షలు చేపట్టాలి

గ్రామంలోఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితుల వివరాలు సేకరించాలని, అవసరమైన చోట రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తాగునీటి వనరులను పరిశీలించడంతో పాటు పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని, నిల్వ నీటిని తొలగించి దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరో కుటుంబంలో ఇలాంటి విషాదం చోటు చేసుకోకుండా, ఒక చిన్నారి మృతి కుటుంబానికి కాకుండా గ్రామం మొత్తానికి తీరని లోటుగా మారింది. జ్వరాల వ్యాప్తికి గల కారణాలను అధికారులు క్షేత్ర స్థాయిలో గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# స్వచ్ఛాంధ్ర సాధనతోనే స్వర్ణాంధ్ర

## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ జయకృష్ణ



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్, 19 ప్రభాతవార్త:

స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్వచ్ఛత అనేది పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన గుర్తు చేశారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం ఉదయం ఎన్జీవో కాలనీలోని మాల్వాడిగుండం కాలువను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు కలిసి శుభ్రం చేసి, మొక్కలు నాటారు. స్వచ్ఛత ఉన్న చోటే ఆరోగ్యం ఉంటుందని ఆరోగ్యం ఉన్న చోటే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అభివృద్ధి సాధిస్తేనే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువ నాయకులు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ల లక్ష్యమైన స్వర్ణాంధ్ర సాధ్యమని ఆయన చెప్పారు. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధిని, మన కాలనీని, మన నగరాన్ని కూడా అంతే బాధ్యతతో పరిశుభ్రంగా ప్రతి ఒక్కరూ ఉంచుకోవాలని ఆయన కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి, సుందర నగరంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని అన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు అందించాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పరిశుభ్ర నగరంగా తిరుపతిని నిలపడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని అందరి చేత కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, టీటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, ఇంచార్జి జె.బి. శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ కార్పొరేటర్ అన్నా అనిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, నగరపాలక సంస్థ అధికారులు,

# తిరుపతి డివిజన్

## నిబంధనలు పాటించని క్వారీలపై చర్యలు

### - ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



వడమాలపేట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: నగరి నియోజక వర్గంలో మైనింగ్ మాఫియా చెలరేగిపోతూ నిబంధనలు పాటించడం లేదని ఫిర్యాదులు ఉన్నాయని అలాంటి వారిపై చర్యలు తప్పవని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. వడమాలపేట మండలంలో శనివారం పలు గ్రామాల్లో సుమారుగా 40 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందిన కొన్ని క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు, పేలుళ్లు జరుగుతున్నాయని అన్నారు. వీటి వల్ల ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని ఇళ్ళకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. ఇకపై ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్‌లు, పేలుళ్ల నిర్వహించేందుకు అనుమతించబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం రెండు ప్రధానమని దానిని సాధించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్కాలర్ మమత రమణికి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి, సెప్టెంబర్ 19ప్రభాతవార్త:

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధన చేసిన అంతర్జాతీయ స్కాలర్ మమత రమణికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్ష విభాగాధిపతి తెలిపారు. ఆచార్య పి. జోత్స్న పర్యవేక్షణలో "సింథసిస్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ బయోఇన్‌స్పైర్డ్ మెటాలిక్ నానోపార్టికల్స్ బై ది మెడిసినల్ ప్లాంట్, క్యాసియా ఆరిక్యులాటా అండ్ దేర్ బయోమెడికల్ అప్లికేషన్స్" అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం

తిరుపతి, సెప్టెంబర్ 19ప్రభాతవార్త:




పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వివిధ పరిశుభ్రత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## దుర్గా నగర్ కాలనీలో వినాయక చవితి మహోత్సవాలు



తిరుపతి, సెప్టెంబర్ 19ప్రభాతవార్త: తిరుపతి నగరంలోని దుర్గా నగర్ కాలనీలో "కాలభైరవ గణపతి విగ్రహం ఆకట్టుకుంది. వినాయక చవితి మహోత్సవాలను కాలనీ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ప్రత్యేకంగా నిర్వహించారు. అందరూ కలిసికట్టుగా ఈ ఉత్సవాలను విజయవంతం చేశారు. ఈ పూజల్లో ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్‌వర్మ పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఆయా పోస్టు లకు దరఖాస్తు చేసుకోవాలి

### ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయకుమారి

పెనగలూరు, సెప్టెంబర్ 19ప్రభాతవార్త:

పెనగలూరు మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు లకు అర్హత ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని ఇండ్లూరు 1 (బీసీసీ), బెస్తపల్లి(ఓసి), తిరుమలరాజు పేట(ఎస్సీ), కొత్త దామనచర్ల(ఓసి), ఆర్. అప్పారాజుపేట (ఓసి), తిరుణంపల్లి(బీసీ డీ) లలో రిజర్వేషన్ ప్రకారం ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఈ నోటిఫికేషన్ గత సంవత్సరం నవంబర్ మాసం లోనే ఇచ్చారు అని కానీ అప్పట్లో జిల్లాల విభజన సందర్భంగా తాత్కాలికంగా నిలిపివేశారని మళ్ళీ ఇప్పుడు అవే పోస్టు లతో రీ నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఇప్పుడు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 21 నుండి అక్టోబర్ 01 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రెడ్డిపల్లి చెరువు నుంచి దర్జాగా మట్టి తరలింపు

### చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు....



ఓబులవారిపల్లి సెప్టెంబర్ 19 ప్రభాత వార్త

రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం శివారు ప్రాంతం రెడ్డిపల్లి చెరువు లో రోజురోజుకు మట్టి మాఫియా అనుమతి లేకుండా జెసిబి ట్రాక్టర్ యంత్రాలతో విలువైన మట్టి ఖనిజాన్ని. తరలిస్తున్న అంతేకాకుండా ఎక్కడ చూసిన విడతల వారీగా పలు యంత్రాలతో మూడు చోట్ల ఆ చెరువులో మట్టి అటు పంట పొలాలకు ఇటుకలు బట్టీలకు తరలిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. వీటిని నివారించాల్సిన అధికారులు. చోద్యం చూస్తున్నట్లు పలు ఆరోపణలు ఉన్నాయి అంతేకాకుండా విలువైన ప్రభుత్వ సంపదను ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ప్రతినిత్యం మట్టి వ్యాపారులు. ట్రాక్టర్ ట్రిప్పు 1000 నుంచి 1500 రూపాయలు ట్రిప్పులు లెక్కన రైతులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది ఏది ఏమైనా సంబంధిత ఉన్న అధికారులు అనుమతులు. మట్టిని తరలించడం నేరమని చెబుతున్నప్పటికీ అలాంటి ఆచరణ ఏమి జరగలేదని తెలుస్తోంది ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు మట్టి మాఫియా పై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు

## వినాయకుని లడ్డు సొంతం చేసుకున్న ఉంగరాల చిన్న..

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబర్ 19(ప్రభాతవార్త )



రైల్వేకోడూరు మండలంలోని ఉంగరాల నగర్ లో వినాయక చవితిని పురస్కరించుకొని లడ్డూ వేలం పాటలో ఉంగరాల చిన్న అనే యువకుడు 1,13,116 రూపాయలతో లడ్డూను సొంతం చేసుకున్నారు. మొట్టమొదటిసారిగా ఈ వినాయక చవితిలో లడ్డువేలం నిర్వహించడం, అందులో భారీగా పాల్గొన్న సందర్భంలో ఎట్టికేళ్లకు ఉంగరాల నగరకు చెందిన చిన్న లడ్డు వేలం పాట పాడి తన కోరికను నెగ్గించుకున్నారు.

రైల్వేకోడూరు రూరల్ 1

## ప్రజా సమస్యలపై ఫోకస్.. జనవాణికి 40 వినతులు

### విద్యుత్ సమస్యలే అధికం..

### పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే ఆరణి ఆదేశం




తిరుపతి విద్య సెప్టెంబర్ 19 ప్రభాత వార్త

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు నిర్వహించిన జనవాణిలో విద్యుత్ సమస్యలే అధికంగా నమోదయ్యాయి. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వంలో శనివారం మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమానికి వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 40 వినతులు అందాయి. ఇందులో 13 వినతులు విద్యుత్‌శాఖ ఎస్ఈకి సంబంధించినవే కావడం గమనార్హం. కార్పొరేషన్ కమిషనర్‌కు మూడు, సహాయ కమిషనర్‌కు ఆరు, కలెక్టర్‌కు రెండు, పోలీసుశాఖకు మూడు, రవాణాశాఖకు రెండు వినతులు అందాయి. హెల్త్ ఆఫీసర్‌కు రెండు, డీఎంహెచ్‌వోకు ఒకటి, తహసీల్దార్, ఏపీఎస్ఎస్‌డీసీకి ఒక్కొక్కటి, టీటీడీ డీఈవోకు మూడు, ఈవోకు ఒకటి, సీఎంఆర్ఎఫ్‌కు రెండు వినతులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వివరించారు. వినతులను పరిశీలించిన ఆయన సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం వినతులను సీపీఏపీ యూనిట్ సభ్యులు సంబంధిత శాఖలకు పంపించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆర్‌వో రవి, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రయ్య, ఎస్పీడీసీఎల్ ఏడీ ఆంజనేయులు, ఏఈ ఉమాపతి, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ కుప్పం సాధనకు యువత నడుం బిగించాలి

### ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం.




కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్వచ్ఛ కుప్పం స్వర్ణకుప్పంలో భాగంగా స్వచ్ఛ కుప్పం సాధనకు యువత నడుం బిగించాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన స్వయంగా చీపురు పట్టి కళాశాల ఆవరణలో పారిశుద్ధ్య పనులను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని పరిశుభ్రమైన కుప్ప0గా మలిచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త.

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు .శనివారం మండలంలోని చెక్కు న్నత్త గ్రామంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అన్ని పంచాయతీల్లో కూటమి అభ్యర్థులు ఖచ్చితంగా గెలుపొందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని పేర్కొన్నారు. పార్టీలో అందరూ సమన్వయంతో పనిచేసి కుప్పంలో విజయ డంకా ముగించాలని ఆయన పిలుపునిచ్చారు. సిఎం చంద్రబాబు కుప్పం లో చేస్తున్న అభివృద్ధి ప్రజలకు చెప్పాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికేయం యుడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ ,ఏపీఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్ ,కనీస వేతనాల మండలి సభ్యుడు శరవణ, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కు న్నత్త మణి, తెలుగు యువత అధ్యక్షుడు కనకరాజు ,మాజీ సర్పంచ్ చిట్టిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

## ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యార్థులకు భారీగా ఉద్యోగాలు..

### 208 మందికి కార్పొరేట్ కొలువులు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 19 ప్రభాత వార్త




చదువు పూర్తికాకముందే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధిస్తూ ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎస్ట సొర్స్ సొల్యూషన్స్, ఆటోసెన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పేస్ సెటర్స్ సంస్థలు పాల్గొన్నాయి. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఎంపిక ప్రక్రియకు హాజరుకాగా, మొత్తం 208 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సంస్థల ప్రతినిధులు విద్యార్థుల విద్యార్హతలు, ప్రతిభ, నైపుణ్యాలను పరిశీలించి ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ. ఉష మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న ప్లేస్‌మెంట్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఐదో సెమిస్టర్‌లోనే 208 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల చైర్మన్ డి.వి.ఎస్. చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ క్యాపస్ టు కార్పొరేట్ లక్ష్యంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కళాశాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసం కొనసాగిస్తూనే ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ కంపెనీలను కళాశాలకు తీసుకువచ్చి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.

## ఎస్వీయూలో పెంచిన మెస్ బిల్లులు తగ్గించాలి :ఎస్ఎఫ్ఐ



తిరుపతి విద్య సెప్టెంబర్ 19 ప్రభాత వార్త

ఎస్వీయూ బాయ్స్ హాస్టళ్లలో పెంచిన మెస్ బిల్లులను వెంటనే తగ్గించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జూలై నెల మెస్ బిల్లులు గతంలో ఎన్నడూ లేనివిధంగా సుమారు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు పెరగడాన్ని నిరసిస్తూ యూనివర్సిటీ ప్రాంగణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనన్నారు. ఒక్కసారిగా మెస్ బిల్లులపై అదనపు భారం మోపడం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. హాస్టల్ మెస్‌లలో అందిస్తున్న భోజనం నాణ్యత కూడా ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. గతంలో విద్యార్థుల మెస్ బిల్లుల కోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థి పేరుపై సుమారు రూ.1,400 నుంచి రూ.2,500 వరకు హాస్టల్ ఖాతాకు నిధులు అందించేదని అశోక్‌కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు అందడం లేదని ఆయన ఆరోపించారు. అదేవిధంగా యూనివర్సిటీ ఏర్పడి దాదాపు 72 సంవత్సరాలు పూర్తవుతున్నా విద్యార్థుల నుంచి రూమ్ రెంట్, మెయింటెనెన్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ ఛార్జీల పేరుతో ప్రతినెలా ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.750 నుంచి రూ.1,200 వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. ఈ ఛార్జీలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెంచిన మెస్ బిల్లులను తగ్గించడంతోపాటు విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే చలో ఎస్వీయూ కార్యక్రమం నిర్వహించి, పరిపాలనా భవనం ఎదుట విద్యార్థులతో కలిసి నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు మహేష్‌బాబు, ప్రవీణ్, విజయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం మహిళల ఘర్షణ

రైల్వేకోడూరు రూరల్ సెప్టెంబర్ 19(ప్రభాతవార్త)::



తిరుపతి కడప బస్సులో మహిళల ఘర్షణ విపరీతంగా జరగడంతో ఎట్టికేలకు రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్లో సద్దుమణిగిన వైనం. కోడూరు ఎస్సై తెలిపిన వివరాల మేరకు తిరుపతి నుండి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సులో కోడూరు మండలం వెంకటరెడ్డి పల్లికి చెందిన కొంతమంది మహిళలు సీటు కోసం ప్రొద్దుటూరుకు చెందిన కొంతమంది మహిళలను బస్సులో మాట్లాడుకోవడం జరిగిందని అయితే ఆ చిన్నపాటి మాటలు రాను రాను విపరీతంగా పెరిగిపోవడంతో ఎట్టికేళ్లకు బస్సు ప్రయాణంలోని అత్యంత భయంకరంగా కొట్టుకొని కోడూరులోని కొంతమంది సమీప బంధువులకు తెలియజేయడంతో ఆ బస్సు పోలీస్ స్టేషన్ వద్దకు రాక వెంకటరెడ్డి పల్లికి చెందిన ప్రయాణికులు ప్రొద్దుటూరు కు చెందిన ప్రయాణికులకు పై విచక్షణ రహితంగా కొట్టుకున్న సందర్భం జరిగిందని దాదాపు అరగంట పాటు స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గర వాదోబువాదాలు తీవ్రంగా జరిగినట్లు అయితే ఇరు వర్గాలు పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ఎవరికివారుగా విడిపోయి ప్రొద్దుటూరుకి పోవాల్సిన వారు వేరే బస్సులో వెళ్ళిపోయారని అదేవిధంగా కోడూరు మండలానికి చెందిన ప్రయాణికులు కూడా ఎటువంటి పోలీసు ఫిర్యాదు లేకుండా ఇరువర్గాలు కంప్లైంట్ లేకుండా ఎవరికి వారుగా వెళ్లిపోయారని ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి వివరించారు.

## అగ్ని ప్రమాద కుటుంబానికి మానవతా ఆర్థిక సాయం



చిట్వేలి, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:

మానవత్వమే మాధవసేవగా భావిస్తూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మరోసారి మానవత్వాన్ని చాటుకుంది. చిట్వేలి మండల కేంద్రంలోని సింగనమల వీధికి చెందిన టంగుటూరు మస్తాన్‌కు చెందిన పూరి గుడిసె గురువారం రాత్రి ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. సంస్థ తరఫున రూ.10 వేల చెక్కుతో పాటు దాతల ద్వారా సమకూరిన రూ.23 వేల నగదును కలిపి మొత్తం రూ.33 వేల ఆర్థిక సాయాన్ని శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులోనూ దాతల సహకారంతో మరింత చేయూత అందిస్తామని మానవత సభ్యులు హామీ ఇచ్చారు. అలాగే చిట్వేలికి చెందిన దొండ్లవాగు మధుసూదన్ కుటుంబ సభ్యులు రూ.5 వేల నగదును బాధిత కుటుంబానికి అందించారు.

## పెరటాసి మాసం తొలి శనివారం

### భక్తి పారవశ్యంలో నగర సంకీర్తన



తిరుపతి, సెప్టెంబర్ 19ప్రభాతవార్త:

పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరం పెరటాసి మాసం తొలి శనివారం సందర్భంగా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. మహావిష్ణువుకు, వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతికరమైన పెరటాసి మాసం ప్రారంభం కావడంతో నగర సంకీర్తనకు ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఈ పవిత్ర మాసంలో వచ్చే ఐదు శనివారాలు గోవింద నామస్మరణ, భజనలు, నగర సంకీర్తనలో పాల్గొంటే స్వామివారి అనుగ్రహం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సర్వమంగళాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. నగర సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో, నుదుటిపై గోవింద నామాలతో గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్నారు. "గోవింద... గోవింద..." నామస్మరణతో తిరుపతి వీధులన్నీ మారుమోగాయి. పవిత్ర మాసంలో వచ్చే ప్రతి శనివారం నగర సంకీర్తనలో పాల్గొని వేంకటేశ్వర స్వామిని స్మరించడం ద్వారా కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మిక శాంతి, సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునినాథరెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సురేంద్రరాజు, కృష్ణంరాజు, పురుషోత్తం యాదవ్, మురళి, మేకల గంగయ్య, కొండేచంగారెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, , వాసుదేవరెడ్డి, అరుణమ్మ, జయమ్మ, విజయకుమారి, అమరావతి, పావని, ఉషశ్రీ, రేవతి, ఉమాజీ, పద్మ, వై. పద్మావతి, సిద్ధమ్మ, ధనమ్మ, కల్పన, నాగరాజమ్మ, పద్మావతి, కళ్యాణి, సుశీలమ్మతో పాటు నగర సంకీర్తన మండలి సభ్యులు పాల్గొన్నారు.

